



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | శనివారం 27-04-2024 | సంపుటి : 06 | సంచిక : 226 | పేజీలు : 8 | వెల : రూ 3-00





# ప్రజాస్వామ్యానికి ఎంతో శుభదినం

## సుప్రీం తీర్పుపై ప్రధాని మోడీ వెల్లడి



పాట్నా, ఏప్రిల్ 26 ( విభారె) : ఈవీఎం-వీవీప్యాట్ పై సుప్రీంకోర్టు బలమైన తీర్పు ఇచ్చిందని, పేపర్ బ్యాలెట్ రూపంలో పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలన్న వాదనను తోసిపుచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు ప్రజాస్వామ్యానికి ఎంతో శుభ దినమని అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్, ఆర్జేడీ ఎప్పుడూ గౌరవించలేదని విమర్శలు గుప్పించారు. బీహార్ లోని అరారియాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మాట్లాడుతూ, బీహార్‌లో గత పాలకుల హయాంలో బూత్ క్యాప్చరింగ్ అనేది సర్వసాధారణ విషయంగా ఉండేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ కోటా కిందకు బీహార్ ముస్లింలను తీసుకురావాలనే యోచనలో ఉందని కూడా ప్రధాని ఆరోపించారు.రాజ్యాంగాన్ని కానీ, ప్రజాస్వామ్యాన్ని కానీ కాంగ్రెస్, ఆర్జేడీ ఎప్పుడూ లెక్కచేయలేదు. దశాబ్దాలుగా ప్రజలను ఓటు హక్కు వినియోగించుకోనీయలేదు. బూత్ క్యాప్చరింగ్ అనేది సర్వసాధారణ విషయంగా ఉండేది. ప్రజలను ఓటు వేయడానికి బయటకు కూడా రానిచ్చే వారు కాదు. ఇప్పుడు ఆలా కాదు. పేదలు, నిజాయితీ ఓటర్ల బలం ఈవీఎంలు. ఆ కారణంగానే ఈవీఎంలను వదిలించుకోవాలని కాంగ్రెస్, ఆర్జేడీ ప్రయత్నాలు చేశాయి. అయితే, ఇవాళ సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా తీర్పు చెప్పింది. పాత పద్ధతిలో బ్యాలెట్ పత్రాల ఓటింగ్‌ను వెనక్కి తెచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది' అని ప్రధాని అన్నారు.ఆ।రెతి: వీవీప్యాట్లపై పిటిషన్లను కొట్టేసిన సుప్రీం కోర్టు.. వ్యవస్థను గుడ్డిగా వ్యతిరేకించవద్దని హితవుకర్ణాటక తరహాలోనే ఓబీసీ రిజర్వేషన్ పరిధిలోకి ముస్లింలను తీసుకురావాలని కాంగ్రెస్ కోరుకుంటోందని ప్రధాని ఆరోపించారు. ఎస్‌సీలు, ఎస్టీలు, ఓబీసీల హక్కులను కొల్లకొట్టేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని తాను ఎంతో బాధ్యతాయుతంగా చెబుతున్నానని వివరణ ఇచ్చారు. మతఆధారిత రిజర్వేషన్లు ఉండరాదని బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ చాలా స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ పార్టీ మత ఆధారిత రిజర్వేషన్ల అమలుకు ప్రయత్నిస్తోందన్నారు. కర్ణాటకలో ఓబీసీ కమ్యూనిటీని కాంగ్రెస్ వంచించిందని, ఓబీసీ జాబితాలో ఆర్థిక స్థోమతతో నిమిత్తం లేకుండా ముస్లింలను చేర్చిందని అన్నారు. దీంతో ప్రస్తుతం ఓబీసీల వాటాలోని 27 శాతం రిజర్వేషన్ ముస్లింల ఖాతాలోకి వెళ్లిపోయిందన్నారు. బీహార్‌తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇదే పద్ధతి అమలు చేయాలని కాంగ్రెస్ కోరుకుంటోందని మోదీ ఆరోపించారు.

# ఉమ్మడి పౌరస్మృతి అమలు మోదీ గ్యారెంటీ : అమిత్ షా



గున , ఏప్రిల్ 26( విభారె) :: ఉమ్మడి పౌర స్మృతి ప్రధాని మోదీ ఇచ్చిన గ్యారెంటీ అని, కేంద్రంలోని బీజేపీ సర్కారు దాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తుందని కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ వ్యక్తిగత చట్టాలను ప్రోత్సహిస్తోందని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని గున లోక్‌సభ స్థానంకు చెందిన అశోక్‌నగర్ జిల్లాలోని పిప్రాయి ఏరియాలో జరిగిన సభలో షా మాట్లాడారు. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా పోటీపడుతున్నారు. తన ప్రసంగంలో రాహుల్‌ను ఆయన టార్గెట్ చేశారు. ప్రజల్ని మభ్యపెట్టేందుకు రాహుల్ బాబా ఏదైనా చేస్తారని, కానీ వ్యక్తిగత చట్టాలను బీజేపీ ఆమోదించబోదన్నారు. ఇది తాను చేస్తున్న ప్రామిస్ అని, ఇది మోదీ గ్యారెంటీ అని కూడా అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసినట్లే దేశవ్యాప్తంగా యూసీసీని అమలు చేయనున్నట్లు షా తెలిపారు. దేశంలో నక్సలిజం, ఉగ్రవాదాన్ని మోదీ సర్కారు అణిచివేసిందన్నారు.

# మోదీ సర్కార్‌లో బడా పారిశ్రామికవేత్తలే బాగుపడ్డారు : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ ఏప్రిల్ 26 (ఆంధ్రరేఖ ప్రతినిధి) : ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఎన్నికల ప్రచార సభల్లో ఉద్వేగానికి లోనవుతున్నారని, ఆయన వేదికపైనే కన్నీళ్లు కార్చే అవకాశం లేకపోలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. గత పదేండ్లుగా ప్రధాని మోదీ పేదల సొమ్మును వారి నుంచి లాగేసుకుంటున్నారని ఆరోపించారు. కర్నాటకలోని బీజాపూర్‌లో శుక్రవారం జరిగిన ర్యాలీని ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ దేశంలో 70 కోట్ల మంది జనాభా వద్ద ఉన్న ఆస్తికి సమానమైన సంపదను మోదీ కేవలం 22 మంది బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారని అన్నారు.దేశంలో కేవలం ఒక శాతం మంది 40 శాతం సంపదను నియంత్రిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగం, ధరల మంటను నియంత్రించి ఆర్థిక వ్యవస్థలో అందరినీ భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ బిలియనీర్లకు నిధులు కట్టబెడితే తాము దేశంలోని పేదలకు నగదును అందచేస్తామని భరోసా కల్పించారు.కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలన్నింటినీ అమలు చేసిందని అందుకే రాష్ట్ర ప్రజలు అధిక ప్రయోజనాలు పొందుతున్నారని అన్నారు. ప్రధాని మోదీ కేవలం కొద్దిమందిని బిలియనీర్లను చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది ప్రజలను లక్షాధికారులుగా తయారుచేస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో రెండో దశలో భాగంగా ఇవాళ కర్నాటకలోని 14 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. బీజేపీతో పొత్తు పెట్టుకున్న జేడీఎస్ మూడు స్థానాల్లో పోటీ చేస్తోంది. మాండ్యా, హసన్, కోలార్ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచారు.

# బొత్స కంట రాలిన కన్నీరు..




విజయనగరం ఏప్రిల్ 26 ( విభారె) : ఎప్పుడు గంభీరంగా కనిపించే మంత్రి బొత్స సడన్‌గా చిన్నపిల్లాడిలా మారిపోయారు. భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. అది కూడా నాలుగు గోడల మధ్య కాదు..వేలాది మంది ప్రజలు చూస్తున్న సమయంలోనే తన కంటి నుంచి నీరు కార్చారు. ఆయన కళ్ల నుండి వచ్చిన కన్నీరును చూసిన కార్యకర్తలు సైతం తమ అభిమానాన్ని ఆపుకోలేక కంటతడిపెట్టుకున్నారు. అందుకు ఇటీవల ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన మేమంతా సిద్ధం సభ వేదికైంది. అదే ఇప్పుడు నెట్టింట వైరల్?గా మారింది. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజయనగరం జిల్లాలో చెల్లూరు వద్ద మేమంతా సిద్ధం బహిరంగ సభలో పాల్గొన్నారు. దానికి జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు. అయితే జగన్ బహిరంగ సభలో కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించిన తరువాత అభ్యర్థులను పరిచయం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా చీపురుపల్లి నుండి బొత్స సత్యనారాయణ అని జగన్ బొత్స పేరు ఉచ్చరించగానే వేలాది మంది కార్యకర్తలు ఒక్కసారిగా తమ కరతాళ ధ్వనులతో, హర్షాతిరేకాలు తెలియజేస్తూ ఒక్కసారిగా సభా ప్రాంగణం అంతా దద్దరిల్లింది. అలా అభిమానుల నుండి వచ్చిన ఆ శబ్దాలు విన్న బొత్స తన పట్ల వేలాది మంది కార్యకర్తలు చూపించిన అభిమానాన్ని తట్టుకోలేని బొత్స ఒక్కసారిగా కన్నీరు పెట్టుకున్నారు.ఇంతలో జగన్ బొత్స గురించి చెప్తూ బొత్స సత్యనారాయణ నాకు తండ్రి సమానులు అని అనడంతో మరింత భావోద్వేగానికి లోనయ్యారు. బొత్స తన కళ్ల నుండి వచ్చిన కన్నీరు ఆపుకోలేకపోయారు. దీంతో సభలో ఉన్న వారితో పాటు లక్షలాదిగా టివీలు, సోషల్ మీడియా ద్వారా వీక్షిస్తున్న ప్రేక్షకులు ఆశ్చర్యాన్ని గురయ్యారు. ఎన్ని సంక్షోభాలు వచ్చినా తన మొండివైఖరి, వాగ్ధాటితో అవలీలగా ఎదుర్కొన్న బొత్స ఎందుకు కన్నీరు పెట్టుకున్నారు అని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. డిసిసిబి బ్యాంక్ చైర్మన్?గా, ఎంపిగా, ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ పలు కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరించిన స్ట్రాంగ్ పర్సనాలిటీ బొత్స కళ్ల వెంట కన్నీరు ఎందుకు వచ్చింది అని మరికొందరు అడుగుతున్నారు. అయితే బొత్స తన రాజకీయ జీవితంలో ఏ ఒక్క పదవి అంత సులువుగా రాలేదనే చెప్పాలి. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ తన రాజకీయ చాణక్యంతో సాధించుకున్న పదవులే ఎక్కువ. ఈ క్రమంలోనే వోక్స్ వ్యాగన్?తో పాటు అనేక ఆరోపణలు, అనేక దర్యాప్తులు ఎదుర్కొన్నారు. అలాంటి ఎన్ని సమస్యలు ఎదురైనా ఏ రోజు చలించకుండా గుండెల నిండా ధైర్యంతో ముందుకు సాగారు. బొత్స ప్రస్తుతం వైసిపి ప్రభుత్వంలో కూడా కీలక నేతగా వ్యవహరిస్తూ రాజకీయ ప్రత్యర్థులను తన వాగ్ధాటితో, రాజకీయ చతురతతో ముచ్చెమటలు పట్టించే బొత్స, ఎప్పుడు గంభీరంగా వ్యవహరించే నాయకుడు ఇలా భావోద్వేగానికి లోనవ్వడం ఏంటి? ఎందుకు కన్నీరు పెట్టుకున్నారు? బొత్స పట్ల అభిమానులు చూపిన అభిమానం తట్టుకోలేకే ఎమోషన్ అయ్యారా? లేక వేరే ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. అయితే తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇంతటి ప్రజాదరణ చూసి తట్టుకోలేక మాత్రమే భావోద్వేగానికి లోనయ్యారని అంటున్నారు ఆయన అభిమానులు.

# సుప్రీంకోర్టు తీర్పు ప్రతిపక్షాలకు చెంపపెట్టు



## ఇవిఎంలపై ఏడుపు ఆపి దేశానికి క్షమాపణ చెప్పండి ప్రతిపక్షాలకు ప్రధాని మోడీ డిమాండ్

పాట్నా ఏప్రిల్ 26 : ఇవిఎంల ద్వారా వేసే ఓటును ఓటర్ వెరిఫైయబుల్ ఆడిట్ ట్రెయిల్(వివిప్యాట్)తో క్రాస్ చెక్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడం ప్రతిపక్షాలకు చెంపపెట్టని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ఇందుకు గాను ప్రతిపక్షాలు దేశానికి క్షమాపణ చెప్పాలని కూడా ప్రధాని డిమాండ్ చేశారు. బీహార్‌లోని అరారియాలో శుక్రవారం ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రధాని ప్రసంగిస్తూ మన ప్రజాస్వామ్యానికి నేడు ఒక సుదినమని అన్నారు. ఇవిఎంల మీద ఏడ్చే ప్రతిపక్షాల మొహంపైన సుప్రీంకోర్టు చెంపదెబ్బ కొట్టిందని ఆయన చెప్పారు.మన ప్రజాస్వామ్యాన్ని, మన ఎన్నికల ప్రక్రియను ప్రపంచమంతా శ్లాఘిస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం తమ రాజకీయ ప్రయోజనాల కోసం అప్రతిష్ట పాల్జేస్తున్నాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై మరోసారి ధ్వజమెత్తుతూ ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఓబిసిల హక్కులను లాక్కునేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని మోడీ ఆరోపించారు. తాను ఈ విషయాన్ని ఎంతో బాధ్యతతో చెబుతున్నానని ఆయన అన్నారు. భారత్‌లో మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండకూడదని బాబా సాహెబ్ అంబేద్కర్ స్పష్టంగా చెప్పారని, కాని కాంగ్రెస్ మాత్రం మతపరమైన రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.కర్నాటక తరహా రిజర్వేషన్ల విధానాన్ని దేశమంతటా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. ఓబిసి వర్గానికి ద్రోహం చేస్తూ ఆర్థికపరమైన స్థితిగతులకు అతీతంగా కర్నాటకలోని ముస్లింలందరినీ ఓబిసి జాబితాలో చేర్చిందని ఆయన ఆరోపించారు. బీహార్‌లోని ఆర్‌జెడి-కాంగ్రెస్ కూటమిపై మండిపడుతూ వారికి భబూరతదేశ రాజ్యాంగమంటే ఏమాత్రం లెక్కలేదని ఆరోపించారు.

# సంపాదకీయం

శనివారం 27-04-2024

## వారసత్వ దుమారం....

వారసత్వ పన్ను విధానం.. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో అమలులో ఉన్న దీనిని తాము అధికారంలోకి వస్తే భారత్‌లో అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకుడు, ఆ పార్టీ ఇండియన్ ఓవర్సీస్ చైర్మన్, సోనియాగాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు అయిన శామ్ పిట్రోడా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలే దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. అధికార బీజేపీకి కాంగ్రెస్ పార్టీ కొత్త అస్త్రం ఇచ్చినట్లయింది. అయితే దీనిపై శామ్ పిట్రోడాతోపాటు పలువురు సీనియర్లు వివరణ ఇస్తున్నా.. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అమెరికాలో వారసత్వ పన్ను చట్టం అమలులో ఉంది. దీని ప్రకారం.. ఆ దేశంలో ఎవరైనా 100 మిలియన్ డాలర్ల ఆస్తి సంపాదిస్తే.. అతడి మరణానంతరం ఆ ఆస్తిలో 55 శాతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. 45 శాతం మాత్రమే అతడి వారసులకు చెందుతుంది. ఇది చాలా ఆసక్తికరమైన చట్టం. సంపాదించిన ఆస్తిలో సగానికిపైగా సమాజం కోసం వదులుకోవాలని ఈ చట్టం చెబుతుంది. సంపాదించిన వ్యక్తికే ఈ ఆస్తి మొత్తం చెందదు. అయితే ఇది అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమలవుతోంది. ఈ చట్టం తనకు బాగా నచ్చిందని శ్యామ్ పిట్రోడా అన్నారు. ఏప్రిల్ 23న ఆయన ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు రెండో దశ ఓటింగ్‌కు ముందు ఆస్తి పంపిణీపై రాజకీయ గందరగోళం మధ్య, వారసత్వ పన్నుపై ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా చేసిన ప్రకటనపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఆయన ప్రకటనపై భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టగా, శామ్ పిట్రోడా ప్రకటనకు కాంగ్రెస్ దూరంగా ఉంది. అమెరికాలో, వారసత్వపు పన్ను చట్టం ఉంది. ఎవరైనా 100 మిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను కలిగి ఉంటే, అతను చనిపోయినప్పుడు అతని పిల్లలకు 45% మాత్రమే బదిలీ అవుతాయి. ప్రభుత్వం మిగిలిన 55% తీసుకుంటుంది. ఇది ఆసక్తికరమైన చట్టమని సామ్ పిట్రోడా పేర్కొన్నారు. మీరు సంపదను సృష్టించారు, మీ సంపదను ప్రజలకు వదిలివేయాలి, మొత్తం కాదు, సగం, ఇది సముచితమని భావిస్తున్నానని, దానిని పేదలకు పంచుతామని శామ్ పిట్రోడా చెప్పారు. "భారతదేశంలో ఆ పరిస్థితి లేదని, ఒకరి సంపద రూ. 10 బిలియన్లు, అతను చనిపోతే, అతని పిల్లలకు రూ. 10 బిలియన్లు చెందుతుందని, ప్రజలకు ఏమీ లభించదు. కాబట్టి దీనిపై దేశవ్యాప్తంగా ప్రజలు చర్చించుకోవాల్సిన అవసరముందన్నారు శామ్ పిట్రోడా. సంపద పునర్విభజనపై కొత్త విధానాలు తీసుకురావల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. సంపద కేవలం ధనవంతుల ప్రయోజనాల కోసం మాత్రమే కాదన్నారు. తాను చేసిన ప్రకటనను సామ్ పిట్రోడా సోషల్ మీడియా వేదికగా సమర్థించుకున్నారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో రాశారు. "వాస్తవాలను మాత్రమే ప్రస్తావించానని, వాటి గురించి ప్రజలు చర్చించుకోవాల్సిన అంశాలని చెప్పాను. దీనికి కాంగ్రెస్‌తో సహా ఏ పార్టీ విధానానికి సంబంధం లేదు. 55% తీసేస్తామని ఎవరు చెప్పలేదన్నారు. భారతదేశంలో ఇలాంటివి జరగాలని ఎవరు చెప్పారు? బీజేపీ ఎందుకు భయపడుతున్నాయి? అంటూ శామ్ పిట్రోడా ప్రశ్నించారు. శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. శామ్ పిట్రోడా ప్రకటనపై వ్యాఖ్యానించడానికి నిరాకరించిన కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్, "సామ్ పిట్రోడా సహా ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి గురువు, స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శకుడు శామ్ పిట్రోడా. భారతదేశ అభివృద్ధికి ఆయన అసంఖ్యాకమైన, శాశ్వతమైన కృషి చేశారు. అతను ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు. పిట్రోడా తాను బలంగా భావించే సమస్యలపై బహిరంగంగా తన అభిప్రాయాలను వ్యక్తపరుస్తాడు. ఖచ్చితంగా, ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తి తన వ్యక్తిగత అభిప్రాయాలను చర్చించడానికి, వ్యక్తీకరించడానికి, చర్చించడానికి స్వేచ్ఛ ఉంది. పిట్రోడా అభిప్రాయాలు ఎల్లప్పుడూ భారత జాతీయ కాంగ్రెస్ స్థితిని ప్రతిబింబిస్తాయని దీని అర్థం కాదన్నారు జైరాం రమేష్. ప్రస్తుతం తన వ్యాఖ్యలను రాజకీయం చేయడం సరికాదన్నారు. ఎన్నికల ప్రచారం నుండి దృష్టిని మరల్చడానికి ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న ప్రయత్నం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రమాదకర ఉద్దేశాలు ఒకదాని తర్వాత ఒకటిగా తెరపైకి వస్తున్నాయన్నారు. మధ్యతరగతి ప్రజలపై మరిన్ని పన్నులు విధించాలని రాజకుటుంబానికి చెందిన యువరాజు సలహాదారు కొంతకాలం క్రితం చెప్పారు. ఇప్పుడు ఈ వ్యక్తులు మరో అడుగు ముందుకేశారు. ఇప్పుడు వారసత్వపు పన్ను విధిస్తామని, తల్లిదండ్రుల నుంచి వచ్చే వారసత్వంపై కూడా పన్ను విధిస్తామని కాంగ్రెస్ చెబుతోందని విమర్శించారు. గత పదేళ్లలో దేశంలో ఆర్థిక అంతరాలు భారీగా పెరిగాయని చెప్పారు. సందప పంపిణీ అంటే ఒకరి ఆస్తులు లాక్కొని మరొకరికి ఇవ్వడం కాదు. సంపద కేంద్రీకరణ జరుగకుండా పంచడం. అంటే ఏకస్వామ్యాన్ని నిరోధించడం అని వివరించారు. మన దేశంలో కనీస వేతనాలు దక్కడం లేదని తెలిపారు. వారసత్వం పన్ను అమలు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు..

## తూర్పు ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న భారీ వర్షాలు..

### టాంజానియాలో 155 మంది మృతి



తూర్పు ఆఫ్రికా దేశాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు టాంజానియా కెన్యా, బురుండీల్లో వరదలు సంభవించాయి. దీంతో ఆయా దేశాల్లో పరిస్థితులు దయనీయంగా మారాయి. పలు ప్రధాన నదులు ఉప్పొంగి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలకు టాంజానియా దేశంలో సుమారు 155 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ప్రధాని కాసిమ్ మజాలివా తాజాగా వెల్లడించారు. బలమైన గాలులు, వరదల కారణంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంట నష్టంతోపాటు రోడ్లు, వంతెనలు, రైల్వేలు పూర్తిగా దెబ్బతిన్నాయని, పలు చోట్ల కొండచరియలు కూడా విరిగిపడినట్లు చెప్పారు. ఈ వర్షాల కారణంగా సుమారు 236 మంది గాయాలపాలైనట్లు తెలిపారు. 51 వేలకు పైగా ఇల్లు ధ్వంసమయ్యాయని, సుమారు రెండు లక్షల మంది వరదలకు ప్రభావితమయ్యారని ప్రధాని కాసిమ్ పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమర్జెన్సీ సర్వీసెస్ సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వదల్లో చిక్కుకుపోయిన వారిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వివరించారు. మే నెలలో కూడా వర్షాలు కొనసాగుతాయని కాసిమ్ హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభావిత ప్రాంతాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఇక టాంజానియా పొరుగు దేశాలైన కెన్యా, బురుండీలలో కూడా భారీ వర్షాల కారణంగా పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. కెన్యాలో వర్షాల కారణంగా 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. తూర్పు ఆఫ్రికా ప్రాంతం ప్రస్తుత వర్షాకాలంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు స్థానిక అధికారులు తెలిపారు.

## రాగల ఐదురోజులు వడగాలులు..
## బయటకు రావొద్దన్న వాతావరణ కేంద్రం..!

తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వడగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. అదే సమయంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడుతుండడంతో ఉష్ణోగ్రతుల పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో ఆదివారం నుంచి సోమవారం వరకు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. శుక్రవారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, వనపర్తి జోగులాంబ జిల్లాల్లో.. శనివారం మంచిర్యాల,



నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వడగాలులు వీస్తాయంటూ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. 28న నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాలకు వడగాలులు వీస్తాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ అవగా.. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే, ఆదివారం కుమ్రంభీం, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 29న నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాలు, 30న కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు వడగాలలు వీస్తాయని చెప్పింది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని చెప్పింది. భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అవకాశాలు కురిసే ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.


## టిక్‌టాక్‌ను అమ్మడం లేదు..
## అమెరికాకు తేల్చిచెప్పిన చైనా కంపెనీ

బీజింగ్: టిక్‌టాక్ ఓ పాపులర్ వీడియో యాప్ అన్న విషయం తెలిసిందే. అయితే ఆ చైనీస్ యాప్‌పై అమెరికాలో ఓ చట్టాన్ని చేశారు. ఆ యాప్‌ను అమ్మివేయాలని లేదంటే బ్యాన్ చేస్తామని ఇటీవల అమెరికా హెచ్చరించింది. ఆ హెచ్చరికల నేపథ్యంలో టిక్‌టాక్ చైనీస్ కంపెనీ బైట్‌డ్యాన్స్ ఓ ప్రకటన చేసింది. టిక్‌టాక్‌ను అమ్మే ఆలోచన లేనట్లు ఆ సంస్థ వెల్లడించింది. బైట్‌డ్యాన్స్ కంపెనీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఈ విషయాన్ని పోస్టు చేసింది.




అమెరికా ఉభయసభలు రూపొందించిన చట్టాన్ని కోర్టులో సవాల్ చేయనున్నట్లు ఇటీవల టిక్ టాక్ కంపెనీ తెలిపింది. టిక్‌టాక్‌ను అమ్మే లేదా బ్యాన్ చేసే చట్టంపై బుధవారం అధ్యక్షుడు బైడెన్ సంతకం చేశారు. బైట్‌డ్యాన్స్ కంపెనీపై చైనా ప్రభుత్వ ఆధిపత్యం ఏమీలేదని టిక్‌టాక్ పదేపదే వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికా కోర్టులో టిక్‌టాక్ గురించి పోరాటం చేస్తామని దాని ఓనర్ షోవూ జి చివ్ తెలిపారు. ఓ ఆన్‌లైన్ వీడియోలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. బైట్‌డ్యాన్స్‌లో చైనీస్ వ్యవస్థాపకుడికి 20 శాతం మాత్రమే షేర్లు ఉన్నాయి. ఇక మరో 60 శాతం షేర్లు ఇన్వెస్టర్ల వద్ద ఉన్నాయి. దాంట్లో అమెరికా కంపెనీ కార్లిల్ గ్రూపు, జనరల్ అట్లాంటిక్, సుస్‌కెన్నా ఇంటర్నేషనల్ గ్రూపులు ఉన్నాయి. మరో 20 శాతం షేర్లు కంపెనీ ఉద్యోగుల ఆధీనంలో ఉన్నాయి. బైట్‌డ్యాన్స్‌లో ఉన్న అయిదుగురు బోర్డు సభ్యుల్లో ముగ్గురు అమెరికన్లే ఉన్నారు.

## బీఆర్‌ఎస్ గెలుపును కాంక్షిస్తూ వినూత్న రీతిలో ప్రచారం



పెద్దపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌విజయాన్ని కాంక్షిస్తూ ఓ కార్యకర్త వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నాడు. జిల్లా కేంద్రంలోబీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా సిద్దిపేట జిల్లా చేర్యాల గ్రామానికి చెందిన గజబీమ్ కార్ మనోహర్ అనే వ్యక్తి పూర్తిగా గులాబీ వస్త్రధారణ, చేతిలో హ్యాండ్ మైక్ పట్టుకొని బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. కాలినడకనే జిల్లా కేంద్రం అంతా కలియ తిరుగుతూ, మైకు ద్వారా పాటలు వినిపిస్తూ ప్రచారం చేస్తున్నాడు. అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించి కేసీఆర్‌కు బహుమానంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. మనోహర్ ప్రచారం ఓటర్లను ఎంతో ఆకట్టుకుంటున్నది.

## తెలంగాణ కోసమే నేను పుట్టా

నల్గొండ, ఏప్రిల్ 26,తనను దేవుడు తెలంగాణ కోసమే పుట్టించారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రజల గుండె చీలిస్తే కనిపించేది కేసీఆర్ అని.. కేసీఆర్ గుండె చీలిస్తే కనిపించేది తెలంగాణ ప్రజలు అని వ్యాఖ్యానించారు. కేసీఆర్.. అర్వపల్లి, తిరుమలగిరి, జనగాం మీదుగా భువనగిరి చేరుకున్నారు. మార్గమధ్యలో పలు చోట్ల కార్యకర్తలు ప్రజలకు అభివాదం చేశారు.. మొత్తం మూడు పార్టీలు పోటీలో ఉన్నాయి. పిచ్చిగా ఉన్మాదంతో కాకుండా ఏపార్టీకి ఓటు వేయాలో ఏ పార్టీ మనకోసం పనిచేస్తదో ఆలోచించి ఓటేయాలి. బీజేపీ మేకిన్ ఇండియా అంటూ పెద్ద పెద్ద నినాదాలు చేస్తూ ఒక్కటి అమలు చేస్తలేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళల మీద దాడులు జరుగుతున్నాయి. డాలరు విలువ 83 రూపాయలకు పెరిగింది. ఒకపార్టీ దేవుని పేరు చెప్పి ఓట్లు అడుగుతంది.. ఇంకో పార్టీ దేవుని మీద ఒట్లు.. ఇదీ నడుస్తాంది. మనం అద్భుతంగా యాదాద్రిని నిర్మించుకున్నం కానీ ఎన్నడూ ఓట్లకోసం వాడుకోలే. భువనగిరిలో బీజేపీ కాంగ్రెస్ మిలకత్ అయినయి. అక్షింతలు తీర్థాలు మన పిలగాన్ల కడుపునింపుతదా? తలకాయ తెగిపడ్డా కరెంటు మోటార్లకు మీటర్లు పెట్టనని చెప్పిన మోడీకి. కేంద్రం ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇయ్యలే. తెలంగాణకు అన్యాయం చేసింది బీజేపీ. ఇప్పుడు యువత భవిష్యత్తు మీదే ఆలోచించాలి. మన శత్రువే కాంగ్రెస్ పార్టీ. నాడు ఎవ్వడు లేకున్నా తెలంగాణ కోసం కొట్లాడి తెలంగాణ తెచ్చుకుని పదేండ్లు నడిపినాం. తల్లికోడివలే అందరినీ కాపాడుకున్నాం. మొదటి సంవత్సరంలోనే చెడిపోయిన కరెంటును బాగుచేసుకున్నాం. రైతులకు రైతుబంధు ఇచ్చుకున్నాం. బసవపురం రిజర్వాయర్ కట్టుకున్నం. కాంగ్రెస్ పెద్దలు ఐదెకరాలకు రైతుబంధు ఇస్తామంటున్నారు. మరి ఆరో ఏకరం వాడు ఎటుపోవాలి? పొలాలను ఎండబెట్టింద్రు. బోర్లు ఎండినాయి పూడికలు తీసే క్రేన్లు మళ్లొచ్చినాయి. ధాన్యం కొంటలేరు. రాత్రిపూట మోటర్ పెట్టి పాము కాట్లకు సచ్చే దుర్మార్గపు పాలన కాంగ్రెస్ ది. కేసీఆర్ పొంగనే కట్కబంజేసినట్టే నీళ్లు ఆగినాయి కరెంటు ఆగింది. దద్దమ్మ ప్రభుత్వం కాకుంటే ఏందన్నట్టు. రైతులు చనిపోతే ఒక్క మంత్రి పోలె సీఎం పోలె. నా కండ్లముందాలనే పంట ఎండిపోతే ఎంజేయాల్నే నోరుమూసుకుని ఊకోవాల్నా కొట్లాడాల్నా? ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఇస్తాలేరు. చేనేత కార్మికులను ఆదుకుంటలేరు. నిరుద్యోగ భత్యం లేదు.. అంతా బోగస్. పంట ధాన్యానికి ఐదొందలు బోనస్ అన్నరు ఇప్పుడు లేదు అంటున్రు. రెండు లక్షలు రుణమాఫీ అన్నారు ఇచ్చింద్రా? కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం తుస్సుమన్నది బోనస్ అయింది. గృహజ్యోతికి విద్యుత్తు.. పరిస్థితి అన్న వస్త్రాలకు పోతే ఉన్న వస్త్రాలు పోయినట్టు అయింది. స్కూటీ రాలేదు కానీ లూటీ అయితాది. నన్ను తెలంగాణ కోసం పుట్టించిండ్రు దేవుడు. ప్రజల గుండె చీలిస్తే కనిపించేది కేసీఆర్.. కేసీఆర్ గుండె చీలిస్తే కనపడితే కనిపించేది తెలంగాణ ప్రజలు. దేర్ హోగా మగర్ అందేర్ నహీ.. మనది సెక్యులర్ పార్టీ. నా బిడ్డను తీసుకపోయి అరెస్ట్ చేసింద్రు.. ప్రాణం పోయేదాకా న్యాయం కోసం కొట్లాడుతాం. బీఆర్ఎస్ కారు గుర్తుమీద ఓటేసి క్యామ మల్లేష్ గారిని గెలిపించండి. ఆయన 24 గంటలు మీ సేవలో వుంటాడు తలలో నాలుక లాగా ఉంటాడు. ఇదే ఉత్సాహం మే 13 దాకా చూయించి బీఆర్ఎస్ ను భారీ మెజారిటీతో గెలిపించాలి" అని కేసీఆర్ పిలుపు ఇచ్చారు.

## హెలికాప్టర్‌కు నో పర్మిషన్..
## ఎడ్లబండిలో వచ్చి నామినేషన్ దాఖలు



పాట్నా:ఎన్నికల వేళ నేతల మధ్య మాటల తూటాలు పేలడంతో పాటు చిత్ర విచిత్రాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా నామినేషన్ పర్వంలోనైతే అభ్యర్థులు తమ బలాబలాలను ప్రదర్శిస్తుంటారు. ఈ క్రమంలోనే ఆసక్తికర ఘటనలు, పరిణామాలు చోటు చేసుకుంటుంటాయి. ఇదే తరహాలో బిహార్‌లోని సమస్తిపూర్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ఒకరు నామినేషన్ వేసేందుకు హెలికాప్టర్‌లో వస్తానని అధికారులను అనుమతి అడిగారు. హెలికాప్టర్‌లో వచ్చి నామినేషన్ వేసేందుకు స్వతంత్ర అభ్యర్థి అమ్రేష్‌రాయ్‌కి అధికారులు అనుమతి నిరాకరించారు. దీంతో ఆయన హెలికాప్టర్ నుంచి ఏకంగా ఎడ్లబండి రేంజ్‌కు వచ్చేశారు. ఎడ్లబండిలో ఊరేగింపుగా వచ్చి డ్యాన్సులతో హోరెత్తించి నామినేషన్ దాఖలు చేశారు. హెలికాప్టర్‌కు అనుమతివ్వనందుకే తాను ఎడ్లబండిలో వచ్చి నామినేషన్ వేశానని అమ్రేష్‌రాయ్ చెప్పారు.

## పొలిటికల్ ఎంట్రీ.. డీకే శివకుమార్ కుమార్తె ఐశ్వర్య ఆసక్తికర వ్యాఖ్యలు

బెంగళూరు: రాజకీయ రంగ ప్రవేశంపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కుమార్తె ఐశ్వర్య స్పందించారు. లోక్‌సభ ఎన్నికల రెండో దశ పోలింగ్‌లో భాగంగా ఐశ్వర్య శుక్రవారం(ఏప్రిల్26?) బెంగళూరులో ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనేదీ లేదని స్పష్టం చేశారు ఐశ్వర్య. 'నాకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనేదీ లేదు. నేను విద్యాసంస్థలు నడుపుతున్నాను. దేశం గర్వపడేలా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు వారి కాగా, 2019 ఎన్నికల్లో కర్ణాటకలో కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచింది డీకే సురేష్ ఒక్కరే కావడం గమనార్హం. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలోని 28 ఎంపీ సీట్లలో బీజేపీ ఏకంగా 25 సీట్లు గెలుచుకుంది.



# జనసేనకు బకెట్ టెన్షన్



కాకినాడ, ఏప్రిల్ 26 ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ఒక ఎత్తైతే... పిఠాపురంలో జరిగే ఎన్నికలు మరో ఎత్తు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ అక్కడ పోటీ చేస్తుండటంతో ఎక్కడలేని ఉత్కంఠ నెలకొంది. గతంలో రెండు చోట్ల పోటీ చేసి ఓటమి పాలైన పవన్... ఈసారి ఏం చేస్తారో అన్న ఆసక్తి అందరిలో కనిపిస్తోంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో భీమవరం, గాజువాక నుంచి పోటీ చేసిన పవన్ కల్యాణ్ రెండు చోట్ల కూడా ఓటమి పాలయ్యారు. అదే ప్రత్యర్థులకు అస్త్రంగా మారింది. ఆయనే గెలవలేని పరిస్థితుల్లో పార్టీని ఎలా నడుపుతారు... అభ్యర్థులను ఎలా గెలిపించుకుంటారనే విమర్శలు వినిపించాయి. అందుకే ఈసారి కచ్చితంగా విజయం సాధించాలన్న కసితో ఉన్న పవన్ కల్యాణ్... పిఠాపురాన్ని బాటిల్ గ్రౌండ్‌గా ఎంచుకున్నారు. కాపులు అధిక సంఖ్యలో ఉన్న పిఠాపురంలో పోటీ చేస్తే కచ్చితంగా విజయం సాధిస్తామన్న ధీమాతో పవన్ కల్యాణ్ అక్కడ పోటీకి సిద్ధపడ్డారు. నామినేషన్ కూడా వేశారు. ఆయనపై వైసీపీ తరఫున ఎంపీ వంగ గీత పోటీ చేస్తున్నారు. పవన్‌ను ఈసారి కూడా ఓడించి ఆయన్ని మరింత దెబ్బ తీయాలని వైసీపీ ప్రయత్నిస్తోంది. దీని కోసం ఉన్న అవకాశాలన్నింటినీ వాడుకుంటోంది. అన్ని బలాలను ప్రయోగిస్తోంది. నామినేషన్ల గడువు నేటితో ముగియనుంది. మరి రెండు రోజుల్లో పోటీలో ఉన్న వారి జాబితా కూడా వెలువడనుంది. అయితే ఇప్పటికే నామినేషన్లు వేసిన వారి పేర్లు, వారు ఎంచుకున్న గుర్తులు ఆధారాంగా మోడల్ బ్యాలెట్ వైరల్‌గా మారుతోంది. అది చూసిన జనసైనికులు, నేతలు కాస్త టెన్షన్ పడుతున్నారు.మూడు పేర్లతో సోషల్ మీడియాలో తిరుగుతున్న ఆ మోడల్ బ్యాలెట్‌లో ఉన్న పేర్లు అన్ని కూడా పవన్ కల్యాణ్‌వే. ఇంటి పేరు కూడా దరిదాపుల్లోనే ఉంది. గుర్తులు కూడా గ్లాస్ గుర్తునే పోలి ఉన్నాయి. ఐదో నెంబర్‌లో ఉన్న కోనేటి పవన్ కల్యాణ్ అనే వ్యక్తి గుర్తు బకెట్, ఆరో నెంబర్‌లో కొణిదెల పవన్ కల్యాణ్ ఆయనకు కేటాయించిన గుర్తు గ్లాస్, ఏడో నెంబర్‌లో కూడా కనుమూరి పవన్ కల్యాణ్ అనే వ్యక్తి నామినేషన్ వేసి ఉన్నాడు. ఆయన కూడా ఓ గ్లాస్ గుర్తును పోలి ఉన్న గుర్తునే తీసుకున్నాడు. ఏడో నెంబర్‌లో ఉన్న జనసేన గ్లాస్ గుర్తును మిగిలిన రెండు గుర్తులు డామినేట్ చేస్తున్నాయి. ఇదే ఓటింగ్ సమయంలో అయోమయానికి గురి చేస్తుందని జనసైనికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓటు వేసేందుకు వెళ్లే ఓటర్లు గ్లాస్ గుర్తు వెతికేందుకు టైం పడుతుందని అలాంటి సమయంలో వేరే గుర్తుపై ఓటు వేసే ఛాన్స్ ఉందంటున్నారు. పూర్తి స్థాయి జాబితా వస్తే దీనిపై ఫిర్యాదు చేయాలని జనసేన భావిస్తోంది. ఇప్పటికే ఈ గుర్తులపై సోషల్ మీడియో జనసైనికులు విరుచుకుపడుతున్నారు అధికార పార్టీ కుట్రల్లో బాగంగా ఇలాంటివి జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. ఈ గుర్తుల కన్ఫ్యూజన్ ఇప్పటి చాలా ఎన్నికల్లో ప్రధాన పార్టీలు నష్టపోయాయి. మొన్న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో కారు గుర్తును పోలి ఉన్న గుర్తులు ఎవరికీ కేటాయించ వద్దని బీఆర్ఎస్ లీడర్లు ఎన్నికల సంఘంతో ఫైట్ చేశారు. ఇదే కాదు... గుర్తు ఒకే కనీసం పేరు చూసైనా ఓటు వేస్తారు అనుకుంటే ఒకటే ఇంటిపేరు... మనిషి పేరుతో ఎక్కువ మందితో ప్రత్యర్థులు ప్రయోగాలు చేస్తుంటారు. దీన్ని కూడా నిలువరించలేని పరిస్థితి ఉంటుంది. అందుకే గుర్తులపై పార్టీలు పోరాటం చేస్తున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో తిరుగుతున్న ఈ పోస్ట్ ఎంత వరకు నిజమో తెలియదు. కానీ జనసైనికుల్లో మాత్రం కాక రాజేస్తోంది.పవన్ పేరుతో ముగ్గురుతాజాగా సోషల్ మీడియాలో మరో ప్రచారానికి తెర తీశారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పేరుతో మరికొంతమంది పోటీ చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. జనసేన అధినేత తో పాటు కోనేటి పవన్ కళ్యాణ్, కనుమూరి పవన్ కళ్యాణ్ అనే వ్యక్తులు నామినేషన్ వేసినట్లు ఓ వార్త వైరల్ అవుతోంది. అయితే అందులో ఎంత మాత్రం నిజం లేదని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఈసీ వెబ్సైట్ ప్రకారం పిఠాపురం బరిలో పవన్ కళ్యాణ్ పేరుతో ఒక్కరే పోటీలో ఉన్నారు. నామినేషన్ గడువు ముగిసే సమయానికి 11 మంది పోటీ చేస్తున్నట్లు తేలింది. కేవలం పవన్ కళ్యాణ్ ను పిఠాపురంలో ఓడించేందుకు జరగని ప్రయత్నం అంటూ లేదు. అయితే దీనిని ముందుగానే పసిగట్టిన జనసేన పార్టీ శ్రేణులను అలెర్ట్ చేసింది. అటువంటి పుకార్లను నమ్మవద్దని పార్టీ శ్రేణులకు అంతర్గతంగా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

# కూటమిలో కావలి, ఉండి టెన్షప్

విజయవాడ, ఏప్రిల్ 26 ఏపీ, తెలంగాణలో నామినేషన్ల పర్వం ముగిసింది. చివరి రోజు కావడంతో అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. అనుచరులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్లు వేశారు. ఇక రేపటినుంచి నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఈనెల 29 వరకు నామినేషన్లు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంది. కానీ పశ్చిమగోదావరి జిల్లా ఉండి టీడీపీలో రాజకీయ ఉక్కపోత మాత్రం అలాగే కంటిన్యూ అవుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో సీన్ మళ్లీ మొదటికొచ్చింది. టీడీపీ అధినేత బుజ్జగించినా శివరామరాజు వెనక్కి తగ్గలేదు. బరిలో ఉంటానని క్లారిటీ ఇచ్చి మరీ నామినేషన్ వేయడంతో టీడీపీ కేడర్‌లో గుబులు మొదలైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే శివరామరాజుకి ముందుగానే సీటు కేటాయించింది అధిష్ఠానం. దీంతో టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే రామరాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు. అయినప్పటికీ శివరామరాజు నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభించారు. ఈ క్రమంలోనే రఘురామ కృష్ణం రాజు ఎంట్రీ ఇచ్చారు. చంద్రబాబుతో భేటీ కావడం.. ఉండి టికెట్ ఆయనకు ఖరారు చేయడం చకచకా జరిగిపోయాయి. దీంతో శివరామరాజు డైలమాలో పడిపోయారు. చంద్రబాబు సర్దిచెప్పినా.. రఘురామ కృష్ణంరాజు ప్రాధేయపడ్డా శివరామరాజు వెనక్కి తగ్గలేదు. ఇవాళ స్వతంత్ర అభ్యర్థిగా భారీ ర్యాలీ మధ్య నామినేషన్ వేశారు. అంతేకాదూ.. విజయంపై ధీమా వ్యక్తం చేశారాయన.శివరామరాజు నామినేషన్‌తో రఘురామ కృష్ణంరాజు ఝలక్ తగిలినట్టయింది. ఎవరేం చేసినా విజయం నాదేనని కాన్ఫిడెంట్‌గా ఉన్నారాయన. ఉండి టీడీపీ టికెట్ ఆశించిన రామరాజు ఇప్పటికే రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. లేటెస్ట్‌గా శివరామరాజు ఇండిపెండెంట్‌గా పోటీలోకొచ్చారు. టీడీపీ తరపున రఘురామకృష్ణంరాజు అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఫైనల్‌గా ఏం జరగబోతుంది? టీడీపీ ఓటు చీలిపోతుందా? గంపగుత్తగా ఒక్కరికే పడుతుందా? ఈ టెన్షన్ ముగ్గురు అభ్యర్థుల్ని కంగారుపెడుతోంది. ప్రస్తుతం ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్ వేస్తున్న అభ్యర్థుల నుంచి పార్టీలకు రెబల్స్ బెడత వెంటాడుతోంది. మరీ ముఖ్యంగా కూటమిలో తీవ్ర అసంతృప్తితో ఉన్న నేతలు ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం నుంచే కాకుండా.. మరోవైపు నెల్లూరు జిల్లా కావలి టికెట్ పొలిటికల్ హీట్ పెంచుతోంది. టీడీపీ అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డి బరిలో దిగుతుండగా.. కూటమిని నుంచి ఆమెకు సపోర్ట్ కరువయ్యింది. ఆమెకు సీటు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్న బీజేపీ నేత పసుపులేటి సుధాకర్ రెబల్‌గా పోటీకి సిద్ధమయ్యారు. బీజేపీని వీడి టీడీపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన ఆయన.. చంద్రబాబు మోసం చేశారంటూ మండిపడ్డారు. ఈ క్రమంలోనే.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు జోరుగా ప్రచారం నిర్వహిస్తూ దూకుడు మీదున్నారు. అయితే నామినేషన్ల ప్రక్రియ నేటితో ముగియనుండటంతో రేపటి నంచి వాటిని పరిశీలించనున్నారు అధికారులు. ఏప్రిల్ 29 వరకు నామినేషన్లు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో రెబల్ గా బరిలో దిగిన వారితో మంతనాలు జరుపుతున్నారు నిజమైన అభ్యర్థులు, ఆయా పార్టీల అధినేతలు. ఇది ఎంతవరకు సర్ధుమణుగుతుందో వేచి చూడాలి

# తమ్ముడి కోసం రంగంలోకి అన్నయ్య



విజయవాడ, ఏప్రిల్ 26 న్నయ్య రంగంలోకి దిగుతున్నారు. తమ్ముడి కోసం ప్రచారం చేయాలని డిసైడ్ అయ్యారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్ కు మద్దతుగా మెగా కాంపౌండ్ వాల్ హీరోలంతా రంగంలోకి దిగనున్నారు. ఈ మేరకు ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు. అయితే అందరికంటే చిరంజీవి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని తెలియడంతో మెగా అభిమానుల్లో సందడి నెలకొంది. పొలిటికల్ సర్కిల్లో కొత్త చర్చకు దారితీస్తోంది. అయితే నాడు ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి అయిన వంగా గీతకు మద్దతుగా చిరంజీవి పిఠాపురంలో ప్రచారం చేశారు. ఆమె ఎమ్మెల్యేగా కూడా గెలిచింది. ఇప్పుడు అదే వంగా గీతకు వ్యతిరేకంగా, పవన్ కు అనుకూలంగా చిరంజీవి ప్రచారానికి రానుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.గత ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసిన పవన్ కు నిరాశే ఎదురయ్యింది. ఆయన రెండు చోట్ల ఓడిపోయారు. ఈసారి మాత్రం ఆ పరిస్థితి రాకూడదని గట్టిగానే డిసైడ్ అయ్యారు. తనను ఓడించేందుకు వైసిపి ఎంతకైనా తెగిస్తుందన్న అంచనాకు వచ్చారు. అందుకే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అశేష జనవాహిని నడుమ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటికే పవన్ కు మద్దతుగా బుల్లితెర నటులు ప్రచారం చేస్తున్నారు. స్టార్ క్యాంపెయినర్లు రంగంలోకి దిగారు.ఇప్పుడు మెగా హీరోలంతా వస్తుండడంతో పిఠాపురంలో వార్ వన్ సైడ్ అవుతుందని జనసైనికులు భావిస్తున్నారు.కొద్దిరోజుల కిందట చిరంజీవి జనసేనకు ఐదు కోట్ల రూపాయల విరాళం ప్రకటించారు. పవన్ కళ్యాణ్ కు అందజేశారు. జనసేనకు ఓటు వేయాలని మెగా అభిమానులకు స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. అయితే అనకాపల్లి నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్,పెందుర్తి నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న పంచకర్ల రమేష్ బాబు చిరంజీవిని కలిశారు.మద్దతు కోరారు.వారిని ఆశీర్వదించిన చిరంజీవి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఒక వీడియో బయటకు విడుదల చేశారు. దీనిపై వైసీపీ నేతలు ఎంత రచ్చ చేయాలో.. అంతలా చేశారు.పిఠాపురం నియోజకవర్గానికి, మెగా కుటుంబానికి మంచి సంబంధం ఉంది. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి వంగా గీత పోటీ చేశారు. నాడు ఆమె కోసం చిరంజీవి ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో గీత విజయం సాధించారు. ఇప్పుడు అదే నియోజకవర్గాన్ని పవన్ ఎంచుకున్నారు. వంగా గీత ఇప్పుడు ప్రత్యర్థిగా మారారు. ఇప్పుడు పవన్ కు మద్దతుగా చిరంజీవి ప్రచారం చేయనున్నారు. మే 5 ఇందుకు ముహూర్తం గా నిర్ణయించారు. చిరంజీవితో పాటు మెగా హీరో రామ్ చరణ్ వస్తున్నట్లు తెలుస్తోంది. బాబాయ్ కోసం ఈ కుర్ర హీరో రంగంలో దిగనున్నట్లు సమాచారం.చిరంజీవితో పాటు నాగబాబు, రామ్ చరణ్ కలిసి పిఠాపురంలో భారీ రోడ్ షో నిర్వహిస్తారని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత రాజకీయ వేదికలపైకి చిరంజీవి వస్తుండడంతో మెగా ఫాన్స్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఎదురుచూస్తున్నారు. సమకాలీన రాజకీయ అంశాలపై మాట్లాడతారా? మాట్లాడితే జగన్ పై ఎటువంటి కామెంట్స్ చేస్తారు? చంద్రబాబు గురించి ఏమైనా వ్యాఖ్యానిస్తారా? లేకుంటే పవన్ ను గెలిపించాలని మాత్రమే అడుగుతారా? అన్నది హాట్ టాపిక్ గా మారింది.

# ఉత్తరాంధ్ర ఎవరి పక్షం

విశాఖపట్టణం, ఏప్రిల్ 26 ఉత్తరాంధ్ర పై అన్ని పార్టీలు కన్నేశాయి. మెజారిటీ సీట్లు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. గత కొద్దిరోజులుగా చంద్రబాబుతో పాటు జగన్ ఉత్తరాంధ్ర పైనే ఫోకస్ పెట్టారు. చంద్రబాబు ప్రజాగళం పేరిట సభలు నిర్వహిస్తుండగా.. జగన్ బస్సు యాత్రలో భాగంగా అన్ని నియోజకవర్గాలను టచ్ చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుతో పాటు పవన్ పాల్గొన్నారు.ఉత్తరాంధ్రలో 34 నియోజకవర్గాల్లో మెజారిటీ సీట్లను దక్కించుకునేందుకు అధికార విపక్షాలు ప్రయత్నించడం విశేషం. అందుకోసమే అటు చంద్రబాబుతో పాటు ఇటు జగన్ ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఉత్తరాంధ్ర ఆ పార్టీని ఆదరిస్తూ వచ్చింది. ఒకవేళ రాష్ట్రంలో అధికారంలోకి రాకపోయినప్పటికీ.. ఉత్తరాంధ్రలో మాత్రం టిడిపి తన ప్రాబల్యాన్ని నిలుపుకునేది. కానీ గత ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర ఓటమి చవిచూసింది. 34 నియోజకవర్గాలకు గాను.. కేవలం ఆరు చోట్ల మాత్రమే గెలుపొందింది. విశాఖ నగరంలోని నాలుగు నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో రెండు స్థానాలతో సరిపుచ్చుకుంది. విజయనగరంలో వైసిపి వైట్ వాష్ చేసింది. అందుకే ఈసారి ఆ పరిస్థితి తలెత్తకుండా చంద్రబాబు అలెర్ట్ అయ్యారు. పొత్తుల్లో భాగంగా జనసేనకు నాలుగు అసెంబ్లీ సీట్లను, బిజెపికి రెండు స్థానాలను కేటాయించారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఈనెల 22 నుంచి ఏకంగా నాలుగు రోజులపాటు ఉత్తరాంధ్రలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు చంద్రబాబు. మరోవైపు పొత్తులో భాగంగా సీట్ల కేటాయింపు విషయంలో తలెత్తిన అసంతృప్తులను చల్లార్చే ప్రయత్నం చేశారు. అందులో కొంత వరకు సక్సెస్ అయ్యారు.జగన్ తన బస్సు యాత్రను ఉత్తరాంధ్రలో ముగించారు. రాష్ట్రవ్యాప్తంగా మేమంతా సిద్ధం పేరిట నిర్వహిస్తున్న ఈ బస్సు యాత్ర.. ఉత్తరాంధ్రలో అడుగుపెట్టేసరికి రూపు మార్చింది. ప్రధానంగా ఉత్తరాంధ్ర వెనుకబాటు, రాజధాని అంశాన్ని ప్రస్తావిస్తూ జగన్ ప్రజలను చైతన్యవంతం చేసే ప్రయత్నం చేశారు. గత ఎన్నికల్లో వైసీపీకి ఉత్తరాంధ్రలో 28 స్థానాలు దక్కాయి. ఈసారి కూడా మెజారిటీ స్థానాలు దక్కించుకోవాలన్న ప్రయత్నంలో జగన్ ఉన్నారు. అందుకే ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలతో పాటు అధికారంలోకి వస్తే తామేం చేయగలమో.. చెప్పుకొస్తున్నారు. విపక్షాల ట్రాప్ లో పడొద్దని ప్రజలకు పిలుపునిస్తున్నారు. మరోవైపు ఎక్కడైతే పార్టీ వెనుకబడి ఉందో అక్కడ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. నేతల మధ్య విభేదాలకు ఫుల్ స్టాప్ పెట్టేలా పావులు కదిపారు.34 నియోజకవర్గాల్లో ఫైట్ నడుస్తోంది. విశాఖ జిల్లాలో కూటమికి అనుకూల పరిస్థితులు కల్పిస్తుండగా.. విజయనగరంలో వైసీపీ ఆశాజనకంగా ఉంది. శ్రీకాకుళం జిల్లాలో అయితే నువ్వా నేనా అన్న పరిస్థితి ఉంది. జనసేన గెలుపోటములను ప్రభావితం చేయనుంది.గత ఎన్నికల్లో దాదాపు మత్స్యకార ప్రాంతాల్లో జనసేనకు గణనీయంగా ఓట్లు పడ్డాయి. అక్కడ వైసీపీకి గెలుపునకు కారణమయ్యాయి. అందుకేఈసారి జనసేన ఓటు బ్యాంకు కలిసి వస్తుందని టిడిపి అంచనా వేస్తోంది. సంక్షేమ పథకాలే తమకు కలిసి వస్తాయని వైసిపి నమ్మకంగా ఉంది. మరి ఎవరు సక్సెస్ అవుతారో చూడాలి.

# ఓ వైపు కేసులు... మరో వైపు బదిలీలు

విజయవాడ, ఏప్రిల్ 26 ఏపీలో అధికార వైసీపీని ఎలక్షన్ కమిషన్ టార్గెట్ చేసుకుందా? అధికారుల బదిలీలు అందులో భాగమేనా? కీలక అధికారులను లూప్ హోల్స్ లో పెట్టడం అందుకేనా? ఇప్పుడు వైసీపీ అభ్యర్థులపై పడ్డారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి ప్రధాన కారణం ఎన్నికల నిర్వహణ. ఇప్పటికే నాలుగో విడత పోలింగ్ ఏపీలో జరగడం వెనుక చంద్రబాబు పాత్ర ఉందని ప్రచారం జరుగుతుంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అధికారుల బదిలీలు, అధికార వైసిపి అభ్యర్థులపై ఎన్నికల కోడ్ కేసులు నమోదవుతుండడం విశేషం.కొద్దిరోజుల కిందట చాలామంది అధికారులను ఎలక్షన్ కమిషన్ బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అయితే అవన్నీ తెలుగుదేశం పార్టీ చేసిన ఒత్తిడితోనే చేసినవన్న ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల కిందట ఇంటలిజెన్స్ చీఫ్ తో పాటు విజయవాడ పోలీస్ కమిషనర్ పై బదిలీ వేటు పడింది. ఈ ఇద్దరు వైసీపీకి అనుకూలమైన అధికారులేనన్న ఆరోపణలు ఉన్నాయి. వీరికి ఎన్నికలతో సంబంధం లేని విధులకు బదిలీ చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో పాటు డిజిపి పై కూడా వేటు తప్పదన్న టాక్ నడుస్తోంది. మరోవైపు ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థుల విషయంలో సైతం యంత్రాంగం వాయిస్ మారుతోంది. ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అయితే.. వైసిపి వారికే నిబంధనల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాజాగా పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ కు ఎన్నికల కమిషన్ షాక్ ఇచ్చింది. ఈసీ ఆదేశాలతో ఆయనపై కేసు నమోదయింది. ఈనెల 13న ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి ఆయన ధర్నా చేశారు. దీనిపై టిడిపి ఎలక్షన్ కమిషన్కు ఫిర్యాదు చేయడంతో ఈసీ స్పందించింది. నివేదిక ఇవ్వాల్సిందిగా గుంటూరు కలెక్టర్ ను ఆదేశించింది. కలెక్టర్ ఇచ్చిన నివేదికతో ఎలక్షన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తక్షణం ఆయన పై కేసు నమోదు చేయాలని పోలీసులకు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే పోలింగ్ సమీపిస్తున్న కొలది ఒకవైపు అధికారులపై వేటు, మరోవైపు వైసీపీ అభ్యర్థులపై కేసులు చూస్తుంటే.. మున్ముందు పరిస్థితులు మరింత తీవ్రతరం కానున్నట్లు తెలుస్తోంది.

# జగన్ కోసం రంగంలోకి భారతి



కడప, ఏప్రిల్ 26 వైసీపీకి ఇప్పుడు జగన్ ఒక్కరే స్టార్ క్యాంపెయినర్. గత ఎన్నికల మాదిరిగా సినీ నటులు లేరు. కుటుంబ సభ్యులు అంతకంటే కనిపించడం లేదు. అందుకే జగన్ ఇప్పుడు ఒంటరి పోరాటం చేస్తున్నారు. ఒక్కరే ప్రచార బాధ్యతలను చూస్తున్నారు. జగన్ కు అంతకుమించి అవకాశం కూడా కనిపించడం లేదని తెలుస్తోంది. ఈ ఎన్నికలు గతం కంటే భిన్నం. గత ఎన్నికలకు ముందు దాదాపు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు జగన్. కానీ ఈసారి అటువంటి యాత్రలకు అవకాశం లేదు. పోనీ తన తరుపున చెల్లెలు షర్మిల, తల్లి విజయమ్మ కూడా ఇప్పుడు లేరు. అందుకే ఈసారి జగన్ బలమైన నిర్ణయానికి వచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా జగన్ పర్యటనలు చేయాల్సి ఉండడంతో.. పులివెందుల బాధ్యతను సతీమణి వైయస్ భారతికి అప్పగించాలని జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈరోజు పులివెందులలో జగన్ ప్రచారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. కార్యక్రమానికి హాజరైన భారతి వారం రోజుల పాటు పులివెందులలో ఉండి ప్రచారం చేయనున్నారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్య అంశాన్ని ప్రస్తావిస్తూ షర్మిల తో పాటు సునీత ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటువంటి సమయంలో పులివెందుల ప్రచార బాధ్యతలు తీసుకుంటున్న భారతి ఎలా రిప్లై ఇస్తారో చూడాలి. అయితే ఆమె పార్టీ శ్రేణులతో సమన్వయానికే పరిమితం అవుతారన్న టాక్ కూడా ఉంది.గత ఎన్నికల్లో భారతి ప్రచారం చేశారు. గత ఐదు సంవత్సరాలుగా పారిశ్రామికవేత్తగా కూడా రాణిస్తున్నారు. సొంత మీడియా బాధ్యతలను ఆమె చూస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆమె తాడేపల్లి లోనే ఉంటూ జగన్ బాగోగులు చూసుకుంటున్నారు. పులివెందులలో ఇప్పటికే జగన్ తరుపున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈరోజు జగన్ నామినేషన్ దాఖలు చేయడంతో పాటు సభలో పాల్గొనడం ద్వారా మలి విడత ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు అయింది. మరోవైపు జగన్ సతీమణి భారతి పులివెందులలో వారం రోజులు పాటు ఇంటింటా ప్రచారం చేయనున్నారు. కాగా పులివెందుల సభలో జగన్ చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. పులివెందుల కల్చర్, కడప కల్చర్, రాయలసీమ కల్చర్ అంటూ వేలెత్తి చూపించే కార్యక్రమం చేస్తున్నారని జగన్ గుర్తు చేశారు. అది నిజమేనని.. మంచి చేయడం మన కల్చర్.. మంచి మనసు మన కల్చర్.. మాట తప్పకపోవడం మన కల్చర్.. బెదిరింపులకు లొంగక పోవడం మన కల్చర్ అంటూ జగన్ చెప్పుకొచ్చారు. పులివెందులను ఈ రాష్ట్రం పువ్వుల్లో పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అందుకే ఒక వైయస్సార్, ఒక జగన్ ను ఈ రాష్ట్ర ప్రజానీకం అభిమానించిన విషయాన్ని ప్రస్తావించారు.జగన్ తన సోదరి షర్మిలకు ఇచ్చి పడేశారు. ఆమె పేరు ప్రస్తావించకుండానే విమర్శనాస్త్రాలు సంధించారు. రాజశేఖర్ రెడ్డి మీద కుట్రలు, కుతంత్రాలు చేసిన.. ఆయన శత్రువులతో పసుపు చీర కట్టుకొని.. వారి ఇళ్లకు వెళ్లి.. వారికి మోకరిల్లి.. వారి కుట్రలో భాగమై.. వారి స్క్రిప్టులను చదివి వినిపిస్తున్న వీరా వైయస్సార్ అభిమానులు అంటూ షర్మిలపై తీవ్రస్థాయిలో జగన్ విరుచుకుపడ్డారు. పనిలో పనిగా బాబాయ్ వివేక హత్య కేసు గురించి కూడా ప్రస్తావించారు. వివేకాకు రెండో వివాహం, సంతానం ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎవరు ఫోన్ చేస్తే అవినాష్ వెళ్ళాడో గుర్తించాలన్నారు. వైయస్సార్ ఎవరి మీద పోరాటం చేశారో.. వారితోనే తన చెల్లెళ్లు చేతులు కలిపారని.. అవినాష్ రెడ్డి చిన్నపిల్లాడు అని జగన్ వెనుకేసుకు రావడం విశేషం.జగన్కు మద్దతుగా గత ఎన్నికల్లో పులివెందులలో భారతీ ఇంటింటా ప్రచారం చేశారు. అప్పట్లో ప్రజలను ఆకట్టుకోవడంలో భారతి సక్సెస్ అయ్యారు. అందుకే ఈసారి రాష్ట్రవ్యాప్తంగా భారతితో పర్యటనలు చేయించాలని జగన్ భావించారు. కానీ ఇప్పుడు కడపలో సొంత కుటుంబ సభ్యులే తనకు వ్యతిరేకంగా మారడంతో.. భారతిని అక్కడే ప్రయోగిస్తే మేలన్న నిర్ణయానికి వచ్చారు.

# డ్రైనేజీ పనుల పరిశీలన



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 26- పట్టణంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి డ్రైనేజీ కి సంబంధించిన పనులను పరిశీలించారు. డ్రైనేజీ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు . డ్రైనేజీలపై నిర్మించిన ఆక్రమణ లను కూల్చివేయాలని సిబ్బందిని ఆదేశించారు . కమిషనర్ వెంట అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. సచివాలయ ఉద్యోగులు. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## .రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అవసరం

### నంద్యాల బిజెపి పార్లమెంట్ కోఆర్డినేటర్ అభిరుచి మధు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 26-రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం చాలా అవసరమని నంద్యాల పార్లమెంట్ కోఆర్డినేటర్ అభిరుచి మదు పేర్కొన్నారు. శుక్రవారం పొత్తులో భాగంగా నంద్యాల పార్లమెంట్ బిజెపి కో ఆర్డినేటర్ అభిరుచి మధును బనగానపల్లి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని బిసి జనార్ధన్ రెడ్డి ఆహ్వానించారు. బనగానపల్లి లో ఆయన కార్యాలయంలో స్థానిక బిజెపి నేతలను పరిచయం చేశారు. ప్రచారాల లో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులు,అభివృద్ధి నీ ఇంటింటా ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా అభిరుచి మదు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో నరేంద్ర మోడి,రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు లతోనే సాధ్యం అవుతుందని అన్నారు. బిజెపి పార్టీ అధిష్ఠానం మేరకు నంద్యాల పార్లమెంటు పరిధిలోని నియోజక వర్గంలో నీ అభ్యర్ధుల విజయానికి బిజెపి నాయకులు,కార్యకర్తలు సైనికుల్లా అభ్యర్థి విజయానికి పాటు పడతారని అన్నారు. ఎన్నికల్లో బిసి జనార్ధన్ రెడ్డి అత్యధిక మెజార్టీ తో విజయం సాధిస్తారని అన్నారు. అనంతరం బిజెపి నాయకులు,కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమం లో బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ . శబరి కి రాయలసీమ స్టీరింగ్ కమిటీ మద్దతు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 26-రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఉద్యమిస్తున్న, రాయలసీమ కరువుకు శాశ్వత నివారణకు కృషి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమ రూపంలో తెలుపుతున్న రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల టీడీపీ లోక్ సభ అభ్యర్థి . బైరెడ్డి శబరి కి మద్దతు తెలిపారు. శుక్రవారం నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి . బైరెడ్డి శబరి ఎన్నికల కార్యాలయంలో కడప జిల్లా నాయకులు రామ్మోహన్ రెడ్డి, చిత్తూరు జిల్లా నాయకులు పోతూరి శ్రీకాంత్ నాయుడు, కర్నూలు జిల్లా నాయకులు నరసింహ, రమేష్ తదితర రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు బైరెడ్డి శబరిని కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడ్డ రాయలసీమ అభివృద్ధికి రాయలసీమ ప్రజా ప్రతినిధులు పాటుపడాలని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమకు ప్రతేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా రాయలసీమ అభ్యున్నతికి ఎంపీ ,ఎమ్మెల్యే లు పాటుపడాలని వారు కోరారు. నంద్యాల టీడీపీ ఎంపీఅభ్యర్థి బైరెడ్డిశబరి గెలుపుకోసం పనిచేస్తామని వారు వివరించారు.

# పదవ తరగతి ఫలితాలలో శ్రీ చైతన్య ప్రభంజనం

విభారే న్యూస్ టుడేనందికొట్కూరు:నందికొట్కూర్ శ్రీ చైతన్య పాఠశాల పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభంజనం సృష్టించింది100% ఉత్తీర్ణత సాధించడమే గాక 589 రుచిత 586 పుష్పక్ 583 ఏ భార్గవి మరియు 500 పైగా 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ దీప తెలియజేశారు ఈ సందర్భంగా పది వ తరగతి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఏజీఎం సురేష్ ఆర్ ఐ చౌదరి కోఆర్డినేటర్ రమణ అకాడమిక్ డీన్ ఉమామహేశ్వరరావు ఏవో గోపాల్ రెడ్డి అభినందనలు తెలిపారు ఈ విజయానికి కారకులైన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు శ్రీ చైతన్య యాజమాన్యం అభినందనలు తెలిపారు.



# రాష్ట్రంలో, దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం రాబోతోంది

## మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 26-దేశంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాబోతోందని, చంద్రబాబునాయుడు మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు .శుక్రవారం నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ . బైరెడ్డి శబరి ఎన్నికల కార్యాలయంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ ఆధ్వర్యంలో టీడీపీ ఆరు గ్యారెంటి పతకాల పోస్టర్లను బైరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తాను తీసుకుంటున్న గోతిలో ఆయనే పాడబోతున్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, ప్రభుత్వ వ్యవస్థలను చిన్నాభిన్నం చేశారని ఆరోపించారు. వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కొందరు యదేచ్ఛగా ప్రకృతి సంపదను దోచేస్తున్నారని, భవిష్యత్తు తరాల ఆస్తి సహజ సంపద అని వాటిని ముందు తరాలకు లేకుండా వైసీపీ నాయకులు దోచుకుంటున్నారని బైరెడ్డి విమర్శించారు. చంద్రబాబు నాయుడు సిఎం, నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా కాబోతున్నారని, వీరిద్దరి నాయకత్వంలో రాష్ట్రం, కేంద్రం అభివృద్ధిలో ముందుకు సాగుతాయని బైరెడ్డి జోష్యం చెప్పారు. వైసీపీ ప్రలోబాలకు ప్రజలు తలవంచకుండా, అప్రమత్తంగా ఉండి ఎన్డీఏ ప్రభుత్వాన్ని గెలిపించాలని, టీడీపీ ఎంపీ అభ్యర్థిగా తన కూతురు డాక్టర్ . బైరెడ్డి శబరి పోటీ చేస్తున్నారని, టీడీపీ ఏడు అసెంబ్లీ , ఎంపీ గా శబరిని భారీ మెజారిటీతో గెలిపించాలని బైరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా నాయకులు ప్రసాద్ రావు, అన్నపురెడ్డి రాజేష్, పాల్ రాజు, నరసింహులు, అనిల్ కుమార్, బాలజోజి, లాయర్ సుధాకర్ తదితరులు పాల్గొని టీడీపీ వాల్ పోస్టర్ విడుదల చేశారు.

# చంద్రబాబు విధానాలు నచ్చి టిడిపి పార్టీలో చేరా

### ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 26-చంద్రబాబు విధానాలు నచ్చి తెలుగు దేశం పార్టీలో చేరానని నంద్యాల 12 వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఖండే శ్యాంసుంధర్ లాల్ పేర్కొన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఎన్ఎండి ఫరూక్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో 28వ తేదీ ఆదివారం బాలాజీ కాంప్లెక్స్ లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశానన్నారు. గత 3 సంవత్సరాలుగా స్వతంత్ర కౌన్సిలర్ గా ఉన్నానని, చంద్రబాబు నాయకత్వం ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమనీ, చంద్రబాబు విధానాలు నచ్చి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు.



టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బహిరంగ సభకు టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నంద్యాల టిడిపి అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఆర్ఐసి చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్సులు రామచంద్ర రావ్, తులసి రెడ్డి, ఎవి అర్ ప్రసాద్, టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు హాజరవుతున్నారని, అలాగే పట్టణంలో ఉన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు, ప్రజలు ఈ బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులుఆనంద్ గురూజీ, బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త, నాగరాజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయబద్ధంగా కుంభోత్సవం



లోక కళ్యాణం కోసం శ్రీ భ్రమరాంబ దేవి వారికి ఈరోజు (26.04.2024) సాంప్రదాయబద్ధంగా కుంభోత్సవం జరిపింపబడుతుంది చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత అమ్మవారికి సాత్విక బలిని సమర్పించేందుకు విశేష ఉత్సవం నిర్వహించబడనీ సాంప్రదాయం. గుమ్మడికాయలు కొబ్బరికాయలు నిమ్మకాయలు అన్నపురాసి మొదలైనవి అమ్మవారికి సాత్విక బలిగా సమర్పించడం జరుగుతుంది. కాగా ఈ ఉదయం జరిగిన కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శ్రీ డి పెద్దిరాజు గారు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి రామకృష్ణ సహాయ కార్యనిర్వహణ అధికారులు ఎం హరిదాసు జి స్వాములు పర్యవేక్షకులు కే అయ్యన్న బి శ్రీనివాసులు అర్చకులు వేద పండితులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. కుంభోత్సవం పురస్కరించుకొని ఈరోజు ఉదయం ప్రాతక్కాల పూజల అనంతరం అమ్మవారికి ఆలయ అర్చకులు నవావరణ పూజ త్రిశతి ఖడ్గమాల అష్టోత్తర కుంకుమ పూజలు పారాయణాలు నిర్వహించారు ఆచారాన్ని అనుసరించి ఈ పూజలన్నీ అమ్మవారికి ఏకాంతంగా నిర్వహించబడ్డాయి. ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి సాత్విక బలిగా గుమ్మడికాయలు కొబ్బరికాయలు ప్రపంచ బడ్డాయి ఉత్సవంలో భాగంగా సాయంకాలం శ్రీ మల్లికార్జున స్వామి వారికి పూజల అనంతరం అన్నాభిషేకం జరిపింపబడుతుంది. స్వామివార్ల పూజల అనంతరం అమ్మవారి ఆలయానికి ఎదురుగా సింహ మండపం వద్ద వండిన అన్నాన్ని కుంభరాశిగా వేయబడుతుంది. తరువాత అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహాయతిని మార్పించడంతో ఉత్సవంలో ప్రధాన ఘట్టం ప్రారంభమవుతుంది. చివరిగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పిండి వంటలతో అమ్మవారికి మహా నివేదన చేయడం జరుగుతుంది. కాగా ఈ ఉత్సవంలో భాగంగానే గ్రామ దేవత అంకాలమ్మకు కూడా ఈ ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి

# మహిళా ఐక్య వేదిక కార్యవర్గ సమావేశం

కర్నూలు, స్థానిక బి క్యాంపులో గల యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక ప్రధాన కార్యాలయంలో కార్యవర్గ సమావేశం మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆద్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ కమిటీ సభ్యులు అందరూ కలిసికట్టుగా శ్రమించి మహిళా ఐక్య వేదికను మరింత బలోపేతం చేయాలని ఆమె ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సభ్యులను కోరారు. కర్నూలు జిల్లా మరియు నంద్యాల జిల్లాలోని అన్ని మండలాల్లో మహిళా ఐక్య వేదిక కమిటీ నిర్మాణాలు చేపట్టాలని, ఆమె కమిటీ సభ్యులకు తెలిపారు. మహిళ తన ఆత్మగౌరవం, హక్కులకై నిరంతరం పోరాడాల్సిన పరిస్థితి ప్రస్తుత సమాజంలో ఉందని ఆమె అన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, హత్యలకు, దాడులకు, వ్యతిరేకంగా మహిళలంతా ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె మహిళా ఐక్య వేదిక కార్యవర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడియం సునీత, హుస్సేన్ బీ, కటికె భాను, పెద్దక్క, ఆకుతోట పద్మావతి,దస్తగిరమ్మ, ఖాసింబీ, లక్ష్మేశ్వరి, షేకున్ బీ, అమీనాబీ, ప్రభావతి , మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 26-శుక్రవారం కలెక్టరేట్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకుల పరిశీలించారు. నంద్యాల పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎస్ మణికందన్ మరియు టికరాం మీనా ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక జిల్లాలో అదికారులు సీజ్ చేసిన నగదు వివరాలతో పాటుగా అభ్యర్థుల ఖర్చులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఉల్లంఘనలు, తీసుకున్న చర్యలు, మీడియా సర్టిపికేషన్ అండ్ మోనటరింగ్ కమిటీ గుర్తించిన ఉల్లంఘనలు, తీసుకున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రచురితమవుతున్న పత్రికలు, వాటి ద్వారావస్తున్న వార్తలు, జిల్లాలో ప్రసారం అవుతున్న లోకల్, శాటిలైట్ చానల్స్ వివరాలు, వాటిపై ఏర్పాటు చేసిన నిఘా, తదితర అంశాలను జిల్లా పౌర సంబంధాల అధికారి మల్లిఖార్జునయ్యను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అన్ని టీంలు సమర్దవంతంగా పనిచేసి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగు చర్యలు తీసుకోవాలని వారు అధికారులను ఆదేశించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190